జిందగీ చైతన్య II
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 3 జూన్ 2024 www.ntnews.com

శబ్దం అంటే... ధ్వని మాత్రమే కాదు. అంతరంగాన్ని కదిలించే అద్భుత సాధనం. శబ్దం అంటే.. ఉచ్చారణ విధానం మాత్రమే కాదు.. శ్వాస నియంత్రణ ద్వారా యోగసాధన చేయించే మార్గం. శబ్దం అనంతశక్తికి నిలయం. విశ్వ ప్రతిస్పందనకు కేంద్రం. సమస్త వాఙ్మయ ఆవిర్భావానికి శబ్దమే మూలాధారం. అందుకే శబ్దం సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. అనంతమైన శబ్దశక్తితో శివుడినే కదిలించింది 'శివతాండవ స్తోత్రం'.

శబ్దం చేసిన ఆనంద తాండవం

రాక్షస వంశంలో పుట్టినప్పటికీ అఖండమైన శివ భక్తిని తనువులోని ప్రతి అణువులో నింపుకొన్నాడు రావణాసురుడు. ఇష్టదైవం పరమేశ్వరుడిని దర్శించుకోవాలనే సంకల్పంతో ఓ రోజు కైలాసానికి చేరుకున్నాడు. ఎంతసేపు నిరీక్షించినా శివుడు కరుణించలేదు. మొత్తంగా కైలాసపర్వతాన్నే పెకలిస్తానంటూ ఆవేశంతో ఊగిపోయాడు. అనుకున్నదే తడవుగా తన ఇరవై చేతులతో కైలాసపర్వతాన్ని పెళ్లగించటం ప్రారంభించాడు. విశ్వమంతా చేష్టలుడిగి చూసింది. పరమేశ్వరి కూడా విస్తుపోయింది. శివుడు మాత్రం ఏమీ పట్టనట్టు ఆనంద తాండవం చేస్తున్నాడు. రావణుడు గాఢమైన మూఢభక్తితో కైలాసాన్ని పెకలిస్తూనే.. ఆర్తితో తన ప్రాణదైవం శివుణ్ని అనేక విధాలుగా స్తోత్రం చేయసాగాడు. రాక్షసుడి నోటి నుంచి అద్భుతమైన స్తోత్రం ఆవిర్భవించింది. 'ఏమిటా అద్భుత వర్ణన... ఏమిటా శబ్ద సౌందర్యం. ఏమిటా ఉపమాన విన్యాసం... అద్భుతం రావణా! భక్తుడవంటే నీవేనయ్యా' అంటూ సృష్టి అంతా ముక్తకంఠంతో ప్రశంసించింది. దశకంఠకృత శివతాండవ స్తోత్రంగా విశ్వవిఖ్యాతి పొంది నేటికీ శివభక్తుల పాలిట కల్పవృక్షంగా ప్రకాశిస్తున్నది ఆ స్తోత్రరాజం. 'అ మంత్రం అక్షరం నాస్తి'– మంత్రం కాని అక్షరం లేదంటారు పెద్దలు. బీజాక్షరాల్లోని మంత్రశక్తి ఈ స్తోత్రంలో అంతర్లీనంగా సాగుతుంది. అందుకే శివ తాండవ స్తోత్రాన్ని కేవలం స్తోత్రంగా కాకుండా మోక్షానికి దోవ చూపించే యోగసాధన విధానంగా గ్రహించాలి.

శబ్ద ఝరి... భావనా లహరి

- శివతాండవ స్తోత్రంలోని తొలి శ్లోకమే పరమేశ్వరుడి నాదతత్త్వాన్ని ప్రకటించటంతో ప్రారంభమవుతుంది. 'డమడ్డమడ్డమడ్డమన్ని నాదవడ్డమర్వయం'... డమ డమ డమ అంటూ మోగే స్వామి డమరుక శబ్దంలోని వైవిధ్యం, ఆ శబ్ద వైభవం, అందుకోసం రావణుడు ఉపయోగించిన శబ్దవైచిత్రి మన మనసుల్ని ఊయలలూగిస్తాయి.
- ధగద్ధగద్ధగజ్జ్వల్లలాటపట్టపావకే, స్మరచ్ఛిదం పురచ్ఛిదం భవచ్ఛిదం మఖచ్ఛిదం గజచ్ఛిదాం ధకచ్ఛిదం, స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం గజాంతకాంధకాంతకం– శివతాండవ స్తోత్రంలో ఇటువంటి అద్భుతమైన పదప్రయోగాలు, విశేషణాలకు కొదవ లేదు. ఒకే పదాన్ని విభిన్న అర్థాల్లో, విభిన్న పదాల్ని ఒకే అర్థంలో ప్రయోగిస్తూ అంత్యప్రాసతో సాగిన తాండవ స్తోత్రం మన మనసుల్ని నిజంగానే ఆనంద తాండవం చేయిస్తుంది.
- 'మకరందం పిబన్ భృంగో గంధాన్నాపేక్షతే యథా/ నాదాసక్తం సదా చిత్తం విషయం నాహి కాంక్షతి' – పువ్వు నుంచి మకరందాన్ని ఆస్వాదిస్తున్న తుమ్మెద మకరందం మత్తులో లీనమై పువ్వు రంగే మిటో కనీసం పట్టించుకోనట్లుగా శబ్దంలో లీనమైన చిత్తం ఇంద్రియ సుఖాలను కోరదు. అది తన చంచలత్వాన్ని విడిచిపెట్టి నాదమనే సుగంధం చేత మత్తెక్కిన దవుతుంది' అని నాదబిందూపనిషత్ చెబుతుంది. శివ తాండవ స్తోత్రం సరిగ్గా ఇలాంటి అనుభూతినే కలిగిస్తుంది.
- మన శరీరంలోని షట్చక్రాలకు శబ్దమే మూలం. మన రెండు చెవులనూ మూసుకుని శ్రద్ధగా ఆలకిస్తే లోపలి నుంచి కొన్ని శబ్దాలు వినిపిస్తాయి. వాటిని అనాహత ధ్వనులు అంటారు. అనాహత చక్రం నుంచి అవి ఉత్పన్నమవుతాయి. అంటే మానవ శరీరం పూర్తిగా శబ్ద (నాద) మయమని అర్థం చేసుకోవాలి. నాదమయమైన తనువుతో నాదస్వరూపుడైన పరమేశ్వరుడిని అర్చించాలి. అదే మోక్షసాధన.
- ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా సృష్టి అంతా శక్తి ప్రకంపనల సమూహమని స్పష్టంగా చెబుతున్నది. ఎక్కడైతే ప్రకంపన ఉంటుందో, అక్కడ శబ్దం ఉంటుంది. యోగాలో ఈ సృష్టి అంతా శబ్దమే అనీ, దీన్ని నాదబ్రహ్మ అని అంటాం. ఈ సృష్టి అంతా సంక్లిష్టమైన శబ్ద అమరికలే. ఈ సంక్లిష్టమైన అమరికల్లో, కొన్ని శబ్దాలను మూల శబ్దాలుగా గుర్తించారు. వీటినే బీజాక్షరాలు అంటారు. ఇటువంటి అనేక బీజాక్షరాల సమాహారంగా సాగుతుంది శివతాండవ స్తోత్రం.

> **శివుడి** రూపం, చేష్టలు ఎంతో చిత్రవిచిత్రంగా ఉంటాయి. అడగ్గానే హాలాహలాన్ని మింగి గరళకంఠుడయ్యాడు. స్వర్గం నుంచి ఉరుకు పరుగు వేగంతో వచ్చే గంగమ్మను ఆపడానికి తన శిరస్సును అడ్డుపెట్టాడు. మరే వస్త్రమూ లేనట్టు గజచర్మాన్ని కప్పుకొన్నాడు. తల మీద చంద్రవంక. ఆ కిందుగా నల్లటి కంఠసీమ. ఆ కింద ఎర్రటి జీరతో ఉండే పులిచర్మం. ఇంతటి భిన్నత్వాన్ని ధరిస్తూ సకల విశ్వాన్ని ఏకత్వభావనతో చూసే పరమేశ్వరుడు ప్రపంచానికి శ్రేయస్సును కలిగించాలని కోరుతుందీ స్తోత్రం.

> **స్వామి** చిదగ్ని స్వరూపుడు. మూడో కన్ను అందించే సందేశం ఇదే. లౌకిక దృష్టికి అందని జ్ఞానాన్ని మూడోనేత్రంతో అందుకోవాలి. పరమశివుడి మూడోకన్ను ప్రళయానికి, విధ్వంసానికే కాదు... జ్ఞానోదయానికి, చైతన్యానికి సూచిక. ఇది ప్రాపంచిక వాంఛలను దూరం చేసే సాధనం. శివయ్య మూడో నేత్రం తెరిస్తే భస్మమే అంటారు. పాపం భస్మమైతే మిగిలేది జ్ఞానమే. అటువంటి బ్రహ్మజ్ఞాన స్వరూపుడైన స్వామి దృష్టి మన మీద నిరంతరం ప్రసాదించమని వేడుకోవాలి. అందుకోసం ఆరాటపడాలని చెబుతుందీ స్తోత్రం.

... డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

కిటుకు

కథాసుధ



ఓ ఆశ్రమంలోని భజన మందిరంలో ప్రతి పౌర్ణమి నాడు భజన, సత్సంగం జరుగుతాయి. ఓ యాభై ఏండ్ల వైద్యుడు మందిరంలో మూలగా కూర్చుని ఉండటం గురువు గమనించాడు. వాడిపోయిన ముఖంతో ఉన్న ఆయన ఏదో మొక్కుబడిగా భజన చేస్తున్నట్టు అనిపించింది. భజన పూర్తయ్యాక గురువు ఆ వైద్యుడిని పిలిచి 'అంత నిరుత్సాహంగా ఉన్నారేం?' అని అడిగాడు. 'మంచి వైద్యుడిగా పెద్దపేరు, అనుకూలవతి అయిన భార్య, ప్రయోజకులైన పిల్లలు.. ఇన్ని ఉన్నా, నా మనసులో ఏదో అశాంతి ఉంటున్నది' అని చెప్పాడు వైద్యుడు. 'ప్రతి ఆదివారం మీ స్వగ్రామానికి వెళ్లి, తోబుట్టువులతో ఆ రోజంతా గడుపు' అని సలహా ఇచ్చాడు గురువు. 'మేమంతా వేరుపడి చాలా ఏండ్లయింది. ఇప్పుడు ఎవరి దారి వారిది. ఇప్పుడు కొత్తగా కలవడం అంటే..' అని నీళ్లు నమిలాడు వైద్యుడు. 'వారు నీకు కొత్తవారు కాదు. మీరంతా ఒక తల్లి బిడ్డలు. నీ రాకను వాళ్లు స్వాగతిస్తారు. తోబుట్టువులు చెట్టుకు కొమ్మల్లాంటి వారు. వేర్వేరు దిశల్లో అవి పెరిగినా.. వాటి మూలాలు మాత్రం ఒకటే. వెళ్లి వారిని కలువు. నీ నిరాశ, నిస్పృహలన్నీ చెయ్యితో తీసేసినట్టుగా పోతాయి' అని సలహా ఇచ్చాడు గురువు. తన మాటలకు తటపటాయిస్తున్న వైద్యుడితో మళ్లీ.. 'గతంలో వారితో ఏమైనా అభిప్రాయభేదాలు తలెత్తి ఉంటే వాటిని మర్చిపో! మనుషులు ఎప్పుడూ ఒకలా ఉండరు. మార్పు అనేది ప్రకృతి సహజం. ఏదీ నిన్నటిలా ఉండదు. మనుషుల మనసులూ అంతే' అని ధైర్యం చెప్పాడు. 'తప్పకుండా కలుస్తాన'ని చెప్పి వెళ్తున్న వైద్యుడితో గురువు 'అలా ఊరికి వెళ్లినప్పుడు నీ చిన్ననాటి మిత్రులను కూడా కలుసుకో' అని చెప్పాడు. నెల తర్వాత మళ్లీ పౌర్ణమికి వైద్యుడు ఆశ్రమానికి వచ్చాడు. ఆయన ముఖంలో నిరాశ లేదు. ఆనందంగా ఉన్నాడు. 'ఇంత చిన్న కిటుకు తెలియక.. నిరంతరం ఏదో పోగొట్టుకున్న వాడిలా కాలం గడిపాను. అనుబంధమనే చికిత్సను గుర్తించక.. ఎన్ని మాత్రలు మింగానో. మీ సలహా నాలో కొత్త ఉత్సాహానికి దారి చూపింది' అని గురువుతో చెప్పి భజనలో చురుగ్గా పాల్గొన్నాడు వైద్యుడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

మెతుకు విలువ

ఇస్లాం బోధ

'ఆహారం విషయంలో హద్దులు మీరే వారిని అల్లాహ్ ప్రేమించడు' అని ఖురాన్ హెచ్చరిక. ఆహార వృథాను ఈ పవిత్ర గ్రంథం తీవ్రంగా ఖండించింది.'తినేటప్పుడు ఆహార వస్త్రంపై పడిన మెతుకులను తీసి తినేవారిని అల్లాహ్ కరుణిస్తాడు' అని ముహమ్మద్ ప్రవక్త (స) చెప్పారు. అంటే ఒక్క మెతుకు కూడా వృథా కారాదన్నది దీని సారాంశం. అన్నం మెతుకుల్ని పారేయడానికి ఎంతో సమయం పట్టదు. కానీ, ఆ మెతుకులు మన నోటిదాకా చేరడానికి నెలలు శ్రమించాల్సి వస్తుంది. ఆహారం దేవుడు ఇచ్చిన వరం. దానిపట్ల మర్యాదగా వ్యవహరించాలి. ఆహార వృథా అరికట్టడం, అన్నదానం ఇవి రెండూ సత్క్రియలే. బీదబిక్కీ, దారిద్ర్యంలో మగ్గుతున్న వారిని గుర్తించి వారి ఆకలి తీర్చడం మంచి లక్షణంగా ఖురాన్ పేర్కొంది. అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాథలకూ, ఖైదీలకూ అన్నం పెడుతూ.. 'మేము కేవలం అల్లాహ్ కోసమే మీకు అన్నం పెడుతున్నాం. మీ నుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని గానీ, కృతజ్ఞతలను గానీ ఆశించటం లేదు' అన్న ఖురాన్ మాటలు ఆచరించే వాళ్లు ధన్యులు. ప్రవక్త సహచరులు తమ జీవితాంతం ఏ ఒక్కరినీ ఆకలిదప్పులతో గడపనిచ్చే వారు కాదు. తాము పస్తులుండైనా సరే తమ తోటి వారి ఆకలి తీర్చేవారు. వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. 'పొరుగువాడు ఆకలితో ఉండి తాను మాత్రం కడుపారా భుజించినవాడు ఎన్నటికీ విశ్వాసి కాలేడు' అన్న ఖురాన్ వచనాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎదుటివాడి ఆకలి తీర్చాలి. మన ఆకలి తీర్చుకునేటప్పుడు అన్నం వృథాకాకుండా చూసుకోవాలి. ఖురాన్ చెప్పిన సత్యమిదే!

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

చల్దులు ఆరగించిన యాగభోక్త

మన పోతన 173 మధురిమ వ భాగం

శుక మహర్షి పరీక్షిత్తుతో... భూవరా! ఏరికోరి క్రూర సర్పం కుక్షిలో దూరి మృత్యు బారినపడ్డ తన వారినందరినీ దూడలతో సహా వారిజాక్షుడు తన కరుణ అనే అమృత వీక్షణాలను కురిపించి బ్రతికించాడు.

ఆ॥ 'అమర వరుల కొఱకు గమల జాండం బెల్ల
బలి బిరస్కరించి బలియు వడుగు
గోప సుతుల కొఱకు బాపవు బెను బాము
గళము దూటు గట్ట బలియ కున్నె?'

శక్రా(ఇంద్రా)ది అమరులకు కలిగిన ఆపదలను నివారించడానికి చక్రధారి హరి వామనుడుగా అవతరించి త్రివిక్రముడై బ్రహ్మాండమంతా వ్యాపించి బలి చక్రవర్తి తలమీద తన పాదతలం (అరికాలు) పెట్టి అతనిని సుతలలోకానికి అణగదొక్కాడు గదా! ఆ మహావిష్ణువు శ్రీకృష్ణుడై గోపబాలురను కాపాడాలని క్రూరమైన ఆ కొండచిలువ (అఘాసురుని) తుండం (నోరు) బ్రద్దలయ్యేటట్లు శరీరాన్ని పెంచడం ఏమంత ఆశ్చర్యం? కంత (మన్మథ) జనకుని– శ్రీకాంతుని ఇంత అద్భుతమైన వింత లీల మరే ఇతర అవతారాలలో ఎంత వెదకినా కనిపించదు. అనఘుడు హరి ఎన్నో అవతారాలలో ఎందరో పాపాత్ములను తరింపజేశాడు. కాని, సాక్షాత్ అఘానికే– పాపానికే ముక్తిని ప్రసాదించిన దివ్యలీల ఈ కృష్ణావతారంలోనే! ఉత్తరాదేవి కుక్షి ప్రవేశం చేసి ఔత్తరేయుని– పరీక్షిత్తుని పరిరక్షణ! అఘాసుర గర్భ ప్రవేశం చేసి గోవత్స గోప అర్భకుల (బాలుర) సంరక్షణ!

క॥'తన రూపాకమారైనను
మనమున నిడికొనిన బాపమయునై నను లో
గొని చను హరి తను మ్రింగిన
దనుజుని గొనిపోవకున్నె తన లోపలికిన్'...

తన రూపాన్ని ఒక్కమారైనా మనస్సులో నిలుపుకొంటే, ఎంతటి పాపినైనా ముకుందుడు– ఆ నందనందనుడు ఆనందంగా తనలో చేర్చుకుంటాడు. ఇక, తనను మింగిన దనుజుని– అసురుని రామానుజుడు తన ధామా– గోలోకానికి చేర్చుకోకుండా ఉంటాడా?
అఘమోక్షణం వీక్షించిన (కన్న) సుమనస్సులు– దేవతలు కుసుమ వర్షం కురిపించి జేజేలు పలికారు. ఆ జయ– జయ ధ్వానాలు విన్న బ్రహ్మదేవుడు ఏదో గొప్ప లోక కల్యాణం జరిగిందన్న ఆనందంతో తిన్నగా భూలోకానికి వచ్చాడు. ఇంతటి మహాసర్పం నోటిలో చిక్కుకున్న లేగలను, బాలురను చిన్ని కృష్ణుడు ఎలా బ్రతికించాడో! అని ముక్కున వేలేసుకున్నాడు. శుకుడు– రాజా! ఆ కొండచిలువ చర్మం కొన్నాళ్లకు ఎండిపోయి చాలాకాలంపాటు గోపబాలురకు ఆటల్లో అండగా ఒక కొండగుహలాగా ఉండిపోయింది. 'బాలకృష్ణుని కౌమార వయసులో– అనగా ఐదవ ఏట జరిగిన ఈ అఘాసుర మోక్షణ లీల పొగండ– అంటే ఆరేళ్ల వయసులో జరిగిందని గొల్లపిల్లలు తలచారు' అని పలికిన శుకమునిని అవనీపతి పరీక్షిత్తు– 'మహనీయా! నిరుడు జరిగిన దానిని ఈనాటిది అని భావించడం ఎవరికైనా ఎలా సాధ్యం? ఇదేదో వింతగా ఉంది. నాకు సాంతం వివరించి చెప్పండి' అని అర్థించాడు. భావి (తరువాతి) కథ గుర్తుకు రాగానే బాదరాయణి (శుకుని)కి భావ సమాధి– అంతర్ముఖత్వం కలిగింది. అప్పుడు శ్రోతలైన మహర్షులు ఎంతో కష్టపడి ఆయనకు బాహ్యస్మృతి– బహిర్దృష్టిని కలిగించారు అని సూత ముని శౌనకాది మహర్షులతో పలికిన మాట. పిమ్మట శుకయోగి...

క॥'ప్రియురాలి వలని వార్తలు
ప్రియజనులకు నెల్లప్రొద్దు బ్రియమగు భంగిన్
బ్రియుడగు హరి చరితంబులు
ప్రియ భక్తుల కెల్ల యెడల బ్రియములు గావే?'

రాజవర్యా! వినయధుర్యా! దివ్యమైన భగవల్లీలలను విన్నప్పుడల్లా నీవు నీ భవ్యమైన ప్రశ్నల ద్వారా వాటికి ఇతోధిక నవ్యత్వాన్ని, రసరమ్యత్వాన్ని కలిగిస్తావు. 'ప్రియురాలిని గురించిన వార్తలు ప్రియులకు ఎల్లప్పుడూ చాలా ప్రియంగా ఉంటాయి. అలాగే ప్రియుని కథలు ప్రియురాండ్రకు కూడా మధురంగానే ఉంటాయి. అయితే, పారమార్థికంగా సృష్టికంతటికి భగవంతుడొక్కడే పురుషుడు– పురుషోత్తముడు. జీవులందరూ అతనికి ప్రియురాళ్లే! వారందరికీ ఏకైక ప్రియుడు పరమాత్మ– 'నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!'. తమ చిత్తాలను భగవదాయత్తం చేసిన భాగవతోత్తములకు భగవత్కథలు ఇంకా ప్రియతరాలు, రసవత్తమాలు కదా!' మూలంలోని 'స్త్రియా విటానామివ సాధు వార్తా' అన్న సొంపైన శ్లోక పంక్తికి మాకందం వంటి పై కందపద్యం, భక్త బృందానికి వందనీయుడైన బమ్మెరగారి కమ్మని పెంపుదల! శుకుడు– రాజా! బాలకృష్ణుని ఈ లీల చాల రసభరితం, రహస్యమయం! శ్రద్ధగా విను. యోగ్యులైన శిష్యుల వద్ద గురువులు రహస్యాలు దాచరు. అడవిలో దూడలు కలివిడిగా, విడివిడిగానూ పచ్చిక మేస్తున్నాయి. ఆటల్లో అలసిపోయిన బాలకులకు ఆకలి అయింది. అంతటి అఘాసురుని సంహరించావు కాని ఈ క్షుధా– ఆకలి అసురుని హరించడం నీతో కాదు గదా కృష్ణా! అంటూ అపహాస్యం– వేళాకోళం చేసుకొంటూ తెచ్చుకొన్న చద్ది అన్నం ఆరగించటానికి కొలను తీరంలో తీరి కూర్చున్నారు. కమల కుసుమపు కర్ణిక (దుద్దు) చుట్టూ దట్టంగా అమరి ఉన్న అమలమైన రేకులవలె గోపబాలురు అనేక వరుసలలో వలయాకారంగా కూర్చుంటే మధ్య కర్ణిక లాగా కమలనేత్రుడు, మేఘవర్ణుడు, అమోఘుడు, కృష్ణుడు కూర్చున్నాడు. మడి– తడి, అంటు– సొంటు అని అనుకోకుండా, ఎగబడి ఒకరి చేతిలోని వంటకాన్ని మరొకరు గుంజుకుంటూ, నంజుకుంటూ; ఎంగిలి మంగళమని ఎంచకుండా 'ఒరే! మువ్వగోపాలుడు ఎలా నవ్వుతున్నాడో అటు చూడు' అంటూ మాయచేసి తనకు ఇరువంకల వారి మధుర పదార్థాలను దొంగిలించి తింటూ; చేతి వేళ్ల సందుల్లో ఊరుగాయ ముక్కలు ఇరికించుకొని, మాటి మాటికి ఉరుగాయు– హరిని ఊరిస్తూ; పక్కవారికి పెట్టకుండా ఒక్కరే మెక్కుతున్న వారిని వెక్కిరిస్తూ– వారిస్తూ... ఇలా నవ్వుతూ, నవ్విస్తూ, ముచ్చట్లు చెప్పుకొంటూ, మురిసిపోతూ తింటున్నారు. పరమాత్మకు కూడా ఎడమచేతిలో చిక్కని మీగడ పెరుగన్నపు ముద్ద, కుడిచేతి వేళ్ల సందుల్లో పసందైన నిమ్మ, ఉసిరి పచ్చళ్ల ముక్కలు!.. 'యాగభోక్త కృష్ణుడమరులు వెఱగంద, శైశవంబు మెరసి చల్ది గుడిచె'.. సర్వయజ్ఞాల ఫలాన్ని భుజించే శ్రీహరి బాల్యక్రీడల లౌల్యం (ఆసక్తి)తో అలా కూర్చుండి చల్ది ఆరగిస్తుంటే అమరులందరూ ఆశ్చర్యంతో నోళ్లు తెరుచుకు చూస్తున్నారు. పరమార్థంలో– వ్రజభూమి (బృందావనం) యజ్ఞభూమికన్నా శ్రేష్ఠం, పవిత్రమన్నమాట! 'భగవంతుని ఎంగిలి భక్తునికి ప్రసాదమైతే, భక్తుని ఎంగిలి భగవంతునికి మాత్రం ఎందుకు ప్రసాదం కాదు?' అని ఆర్యవచనం. చిన్ని కృష్ణుని ఇదొక చిన్మయలీల! బాలకృష్ణుడు చల్ది ఆరగిస్తుండగా వేల్పుల పెద్ద, వయోవృద్ధుడు విధాత– బ్రహ్మదేవుడు చూచి విస్మయం చెందాడు. ఇతడేమి భగవంతుడు? విధి విధానం లేక ఉచ్ఛిష్టం– ఎంగిలి తింటున్న ఇతడు 'ఇష్టుడు, విశిష్టుడు, శిష్టేష్టుడు' (విష్ణు సహస్రం) అయిన విష్ణువా? అని సురజ్యేష్ఠునికి– బ్రహ్మకు కూడా సందేహం కలిగింది. ఆహా! హతవిధీ! విధాతకు కూడా విధి వక్రించింది! బ్రహ్మ కూడా భ్రమకు లోనయ్యాడు. పరమాత్మను పరీక్షించాలనే పాడు బుద్ధి పుట్టింది. ఇటు అటు పరికించి పితామహుడు పటుతరమైన తన ఇంద్రజాలంతో దూడలను మటుమాయం చేశాడు. క్షీరసాగరానికి వెళ్లి శేషశాయి శ్రీమన్నారాయణుని భూభార హరణం కొరకు అవతరణం చెయ్యమని ప్రార్థించిన పరమేష్ఠి– బ్రహ్మ, దేవకీ గర్భస్థుడైన దేవదేవుని స్తుతించిన అబ్జయోని– బ్రహ్మ, నేడు భగవంతుని సగుణ లీలను కని గ్రహించలేని వాడై తలక్రిందులై పోతున్నాడు. చతుర్ముఖుడే ఇలా చతికిల పడితే ఇక పతిత జీవనుల– పామరుల పరిస్థితి ఏమిటి? నిర్గుణ బ్రహ్మను తెలుసుకోవడం కొంత సులభమేమో గాని, సగుణ బ్రహ్మ లీలల అవగాహన అతికఠినం– అని మనీషుల, మహాత్ముల అభిమతం.
శుకుడు– రాజా! నందనందనునితో కూడి గోపబాలురు చల్దులు ఆరగిస్తుండగా దూడలు దొంగమేతలు మేస్తూ ఎంతో దూరం వెళ్లిపోయాయి. కనుచూపు మేరలో అవి కనపడక పిల్లలు భయపడుతుంటే నల్లనయ్య– 'మిత్రులారా! పర్వాలేదు. కంగారు పడకుండా మీరు తింటూ ఉండండి, నేను బంగారంగా వెదకి తెస్తా' అంటూ సర్వదర్శనుడు బయల్దేరాడు. అనన్య శరణాగత భక్తుల యోగక్షేమాలు వహించే భరణం తనదే కదా! మూలంలో 'సపాణి కవలో యయౌ' (చేతిలో ఉన్న పెరుగన్నపు ముద్దతోనే కన్నయ్య బయల్దేరాడు) అని మాత్రమే ఉన్నది. వత్సాన్వేషకుడైన శృంగార రత్నాకరుని– బాలగోపుని వన్నెచిన్నెల రంగారు– విలాసయుక్తమైన రూపాన్ని మన పోతన్న ముద్దులు మూట కట్టినట్లు నేత్రోత్సవంగా ఎలా వర్ణించాడో ఆలకించండి..

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

శా॥ కర్ణాలంబిత కాక పక్షములతో గ్రైవేయ హారాళితో
స్వర్ణాభాసిత వేత్ర దండకముతో సత్పింఛదామంబుతో
బూర్ణోత్సాహముతో ధృతాన్న కబళో త్ఫుల్లాబ్జ హస్తంబుతో
దూర్ణత్వంబున నేగె లేగలకునై దూరాటవీ వీథికిన్.'.

చెవుల వరకు వ్రేలాడుతున్న జులపాల జుట్టుతో, మెడలో మిలమిల లాడే హారాలతో, బంగారం వలె తళుకులీను చేతికర్రతో, సిగపై కన్నులపండువుగా కదలాడే నెమలిపింఛపు సొగసుతో, విప్పారిన ఎర్ర తామర వంటి అరచేతిలో తెల్లగా మెరుస్తున్న పెరుగన్నపు ముద్దతోనే ముద్దుకృష్ణుడు ఉత్సాహంతో లేగలను వెతుకుతూ వడివడిగా అడవి దారుల్లో చాలా దూరం వెళ్లాడు. దూడల జాడలు తెలియక తిరిగి కొలను వద్దకు వచ్చాడు. ఇక్కడ గోపబాలురను కూడా మాయంజేసి బ్రహ్మదేవుడు ఒక గుహలో– రహస్య ప్రదేశంలో దాచి ఉంచాడు.

(సశేషం)

అభేద భావన

ఉపనిషత్ వాక్యం

శివాయ విష్ణురూపాయ
శివరూపాయ విష్ణవే।
శివస్య హృదయం విష్ణు
ర్విష్ణుశ్చ హృదయం శివః॥

(స్కందోపనిషత్తు)

'విష్ణు స్వరూపుడైన శివుడికి, శివ స్వరూపుడైన విష్ణువుకు నమస్కారం. శివుడి హృదయం విష్ణువు. విష్ణువు హృదయం శివుడు...' అని ఈ ప్రసిద్ధమైన శ్లోకం భావం. ఉన్నది ఒకటే పరతత్త్వం. కనిపించేవి మాత్రం రెండు రూపాలు. శివ భక్తులలో చాలామందికి విష్ణువు అంటే అదో రకమైన భావన! విష్ణు భక్తులకూ శివుడంటే అంతే! భక్తి అనేది పరాకాష్ఠకు చేరితే ఈ భేదభావాలు ఉండవు. భేదం కనిపిస్తున్నదంటే భక్తి అనేది పరిణతి చెందలేదనుకోవాలి.
శివ కేశవులలో ఎవరు గొప్ప అనే విషయం మీద ఒకసారి ఒక పండిత సభ ఏర్పాటైంది. ఎందరో వచ్చారు. వాదోపవాదాలు జరిగాయి. ఎటూ తేల్చలేకపోయారు. బరద్వాన్ మహారాజా ఆస్థాన విద్వాంసులు మహాపండితులైన పద్మలోచన తర్కాలంకార్ దగ్గరికి వెళ్లి దీనిని పరిష్కరించమని ప్రార్థించారు. దానికి 'నేను గాని, నా వంశంలో అటు ఏడు, ఇటు ఏడు తరాల వాళ్లు గానీ శివుణ్నీ చూడలేదు, విష్ణువునీ చూడలేదు' అని ఆయన బదులిచ్చారు. ఈ విషయాన్ని శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యులకు

చెబుతూ.. 'ఒకరితో ఒకరు ఇలా తగవులాడుతూనే ఉంటారు. ఇది వివేకవంతుల పని కాదు. భగవంతుడి కోసం ఆర్తి చెందేవారు అన్ని మార్గాలూ అతణ్ని చేర్చేవే అని తెలుసుకుంటారు. ఏదేమైనా ఏకాంకిత నిష్ఠ కావాలి' అని బోధించారు. చూసినవాళ్లు ఉన్నట్లయితే వాగ్వివాదాలకు తావు ఉండదని, వాదించే వారిలో భగవత్ సాక్షాత్కారం చేసుకున్న వాళ్లు లేరని, వారి భక్తి అంతవరకు చేరుకోలేదని తర్కాలంకార్ మాటల్లోని సారాంశం. శివకేశవులలో ఒకరిని నిష్ఠగా సేవిస్తే మరొకరిని ద్వేషించాలని ఎవరూ చెప్పలేదు. అలాంటి వారికోసమే ప్రత్యేకంగా ఉపనిషత్తు 'శివాయ విష్ణురూపాయ..' అనే శ్లోకాన్ని ప్రవచించిందా! అనిపిస్తుంది.

... డా.వెలుదండ సత్యనారాయణ